ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

గుమ్మడిదల, సెప్టెంబర్ 12: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమడుగులో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్ బతుకుదెరువు కోసం ముగ్గురు కొడుకులు, కూతురుతో కలిసి దోమడుగుకు వచ్చాడు. ప్రగతి పాలిమార్ పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు అంకిత్‌కుమార్(19) తమ సొంతగ్రామం బాక్సర్ జిల్లా, పచ్‌ఫేడవాకు చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. అక్కడ ప్రేమ విఫలం కావడంతో ఊరికి వెళ్లిన అంకిత్‌కుమార్ పది రోజుల క్రితం దోమడుగుకు వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, సెప్టెంబర్ 12: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ప్రసాదరావు కథనం ప్రకారం.. బీదర్‌కు చెందిన ఓంకార్ షెట్కార్(50) జహీరాబాద్ సమీపంలోని హుగ్గెల్లిలో బైక్‌పై 65వ జాతీయ రహదారి దాటుతుండగా జహీరాబాద్ వైపునకు వెళ్లే డీసీఎం ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

బొల్లారం సెప్టెంబర్ 12: బొల్లారం పారిశ్రామిక వాడలో పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. గురువారం నమ్మదగిన సమాచారం మేరకు మల్లన్న బస్తీలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కాటన్‌పల్లికి చెందిన యువకులు యశ్వంత్ రెడ్డి, మల్లికార్జున్ వద్ద నుంచి నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిట్టిబాబు ఆధ్వర్యంలో క్లూస్ టీం సభ్యులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై దశరథ్, క్లూస్ టీం హెడ్ కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్ సౌమ్య నాయక్, మల్లేశం, కానిస్టేబుల్స్ సంజీవ్, అశోక్ ఉన్నారు.

నారాయణఖేడ్‌లో చోరీ

నారాయణఖేడ్, సెప్టెంబర్ 12: ఇంట్లో వారు వాకింగ్‌కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారం, వెండి ఎత్తుకెళ్లిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతంలో అద్దెకు నివాసముంటున్న రేగోడ్‌కు చెందిన ప్రభాకర్ బుధవారం రాత్రి ఇంటి తలుపులు తెరిచి ఉంచి తన భార్యతో కలిసి వాకింగ్‌కు వెళ్లాడు. పది నిమిషాల తర్వాత ఇంటికి వచ్చి చూడగా అతని భార్య శ్రీకన్య హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న 6.5 తులాల బంగారం, నాలుగు తులాల వెండి పట్టగొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న లోక్ అదాలత్

నారాయణఖేడ్, సెప్టెంబర్ 12: నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టులో ఈనెల 28న మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ శ్రీధర్ మందని తెలిపారు. దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని లోక్ అదాలత్ కల్పిస్తుందన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

బాధితులకు పరామర్శ

కంగ్టి, సెప్టెంబర్ 12: మండలంలోని జమ్గి(కె) గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రాజుపాటిల్, బీఆర్ఎస్ ముర్కుంజాల్ గ్రామ సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డిని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బుధవారం రాత్రి వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. రాజుపాటిల్ అనారోగ్యానికి గురై ఇటీవల దవాఖాన నుంచి తిరిగివచ్చారు. బాల్‌రెడ్డి భార్య ఇటీవల మృతి చెందడంతో పరామర్శించి ధైర్యం చెప్పారు.

మహిళ మిస్సింగ్

అమీన్‌పూర్, సెప్టెంబర్ 12: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మిస్సింగ్ కేసు నమోదైంది. పటేల్‌గూడ బీఎస్ఆర్ కాలనీకి చెందిన స్వాతి(28), సంతోష్‌గౌడ్ దంపతులు. కుటుంబ కలహాలతో స్వాతి తన మూడేండ్ల కుమారుడు సంబోధ్‌ను వెంట పెట్టుకొని బుధవారం రాత్రి 10 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో స్వాతి అక్క పల్లవి భర్త పాండుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు తెలిపారు.

బయోమైనింగ్ పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో డంపు యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 12: డంపు యార్డుల్లో బయోమైనింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట, పోతిరెడ్డిపల్లి, హత్నూర మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామాల్లో పర్యటించారు. డంపు యార్డుపై ఇస్మాయిల్‌ఖాన్‌పేట ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అక్కడ పర్యటించిన కలెక్టర్ డంపుయార్డును పరిశీలించారు. డంపు యార్డులో చెత్త బయట వేయకుండా బయోమైనింగ్ చేయాలని ఆదేశించారు. పురపాలిక శాఖతో సృష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. రోజుకు 1,500 మెట్రిక్ టన్నుల చెత్తను మైనింగ్ చేసేలా ప్లాంట్‌ను ఏర్పాటవుతుందని, డిసెంబర్‌లోగా అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. దవాఖానలో డెంగీ కేసులపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. అనంతరం గుండ్లామాచునూర్‌లో మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి మొక్కలు నాటారు. పోతిరెడ్డిపల్లిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను పరిశీలించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్లు దేవదాసు, పర్వీన్‌షేక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వారిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సన్మానించారు. గురువారం పటాన్‌చెరులోని జీఎమ్మార్ ఫంక్షన్‌హాలులో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతి స్కూల్‌కు ఎమ్మెల్యే రూ.5 వేల చొప్పున అందజేశారు. మొత్తం 75మంది ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల విద్యా బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఉపాధ్యాయులకు ఎలాంటి కష్టం వచ్చిన అండగా ఉంటానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పీపీ రాథోడ్, జెమినికుమారి, నాయకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సామర్థ్యాల అంచనా ప్రోత్సహించేలా ఉండాలి

మాట్లాడుతున్న డాక్టర్ లీనా

పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: సామర్థ్యం అంచనాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలని ఇఫ్లూ విశ్వవిద్యాలయం, అఖిల భారత భాషోపాధ్యాయుల సంఘం డైరెక్టర్ డాక్టర్ లీనా ముఖోపాధ్యాయ అన్నారు. గురువారం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రభావవంతంగా పరీక్ష పేపర్లు అభివృద్ధి చేయడం, బ్లూమ్ వర్గీకరణ, మూల్యాంకన రూపకల్పన అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తించుకోవడం, అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, మూల్యాంకనం చేయడం, సృజనాత్మకంగా వ్యవహరించడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. గీతం శివాజీ ఆడిటోరియంలో ఓనం సంబురాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీఎస్‌హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీ సన్నీ జోస్, ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అమిత్‌కుమార్, డాక్టర్ రూత్ జర్జోమావి హౌజెల్, తదితరులు పాల్గొన్నారు.

ఫత్తేపూర్‌లో సాధారణ జ్వరాలే

వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కల్హేర్, సెప్టెంబర్ 12: ఫత్తేపూర్‌లో విష జ్వరాలు లేవని, సాధారణ జ్వర పీడితులు మాత్రమే ఉన్నాయని అధికారులు సర్వే చేసి తెలిపారు. మంచం పట్టిన ఫత్తేపూర్ అనే శీర్షికతో ఓ దిన పత్రికలో వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీవో రమేశ్‌బాబు, ఎంపీవో శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి సర్వే చేపట్టారు. సాధారణ జ్వరాలు రోజుకు 2 నుంచి 6 మంది కేసులు నమోదు అయ్యాయన్నారు. డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు నమోదు కాలేదన్నారు. ఓ యువకుడు మృతి చెందాడని, అతడు ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందినట్లు దవాఖాన రిపోర్టులో ఉందన్నారు. వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ కార్యదర్శి నగేశ్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 12: గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి, లబ్ధిదారుల ఫొటోలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం వార్డుల వారీగా ఓటరు జాబితాలను ప్రదర్శించాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సురేశ్, ఏపీవో రంగారావు పాల్గొన్నారు.

15న డాక్టర్ కిషన్‌రావు సంస్మరణ సభ



డాక్టర్ కిషన్‌రావు సంస్మరణ సభ కరపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 15న ఇటీవల మృతి చెందిన ప్రముఖ పర్యావరణవేత్త, దివంగత డాక్టర్ అల్లాణి కిషన్‌రావు సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని అల్లాణి కిషన్‌రావు స్మారక కమిటీ కరపత్రాన్ని విడుదల చేసింది. గురువారం పటాన్‌చెరులో నిర్వహించిన కార్యక్రమంలో స్మారక కమిటీ సభ్యులు భిక్షపతి ఆర్‌వీ ఎస్ రవి, జగన్‌రెడ్డి, కృష్ణమూర్తి, శేషాద్రి వివరాలు తెలిపారు. కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, డాక్టర్ అల్లాణి కిషన్‌రావు స్మారక కమిటీ, కాలుష్య నివారణ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో కాలుష్య సమస్యను గుర్తించి సుప్రీంకోర్టులో, గ్రీన్ ట్రిబ్యునల్‌లో అనేక కేసులు వేసి న్యాయ పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ కిషన్‌రావు అని తెలిపారు. ఆయన సెప్టెంబర్ 1న మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగం బలోపేతానికి సంస్కార విద్యా వ్యాప్తి చేశారని, గోవుల సంరక్షణకు, సంఘ సంస్కరణలకు ఆయన కృషి ఎనలేనిదని గుర్తు చేశారు. అల్ కబీర్ జంతువధశాల మూసివేయాలని చేసిన ఉద్యమం ప్రజలకు గుర్తున్నదన్నారు. కాలుష్యంపై పర్యావరణ వేత్త, దివంగత చిదంబరంతో కలిసి చేసిన పోరాటంతోనే కాలుష్య పీడిత గ్రామాలకు ఉచిత తాగునీరు లభించిందన్నారు. పటాన్‌చెరులో 200 పడకల దవాఖాన రావడానికి ప్రధాన కారణం వీరి పోరాటమేనన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో ఆయన ఒక సభ్యుడిగా ఉంటూ ఈ ప్రాంత ప్రజలకు మేలు చేశారని, డాక్టర్‌గాను ప్రజలకు ఐదు దశాబ్దాలుగా సేవలందించారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పర్యావరణవేత్తలు, ఆయన అభిమానులు పెద్దఎత్తున వస్తున్నారని తెలిపారు.

పోలీసులను తప్పుదోవ పట్టిస్తే చర్యలు

కోహీర్, సెప్టెంబర్ 12: డయల్100కు కాల్ చేసి పోలీసులను తప్పుదోవ పట్టించే వారిపై చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ హెచ్చరించారు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గొల్ల దశరథ్ ఈ నెల 10న అర్ధరాత్రి తాగిన మత్తులో డయల్ 100కు కాల్ చేశారన్నారు. అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఫేక్ కాల్‌గా గుర్తించామన్నారు. అతడిని గురువారం జహీరాబాద్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నీరు నిల్వ ఉండొద్దు

కంగ్టి, సెప్టెంబర్ 12: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని తుర్కవడగామలో చేపడుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామాల్లో అక్కడిక్కడ నీరు నిల్వ ఉండడంతో దొమల బెడద అధికమయ్యే అవకాశం ఉందన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

కంది, సెప్టెంబర్ 12: మండల కేంద్రమైన కందిలో పారిశుధ్య నిర్వహణ లోపంపై జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కంది డంపింగ్ యార్డును పరిశీలించారు. నిర్వహణ సరిగా లేకపోవడం, తడి, పొడి చెత్తను వేరు చేయకపోవడంపై పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కనే అసైండ్ భూమిలో వేస్తున్న చెత్తతో భరించలేని దుర్వాసన వస్తుండటంపై మండిపట్టారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, మురికి కాల్వలను శుభ్రం చేయించాలని, గ్రామంలోని విధులన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు రోజుల్లో మళ్లీ తనిఖీకి వస్తానని, మార్పు కనపడకుంటే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది మల్లేశం ఉన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

హత్నూర, సెప్టెంబర్ 12: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో అనిత హెచ్చరించారు. గురువారం మండలంలోని కొన్యాల గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. మురుగు కాల్వల్లో పూడిక తీయాలని, పిచ్చిమొక్కలను తొలిగించి రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో యూసుఫ్ ఉన్నారు.

లబ్ధిదారులకు సబ్సిడీ సమాచారమివ్వాలి

బొల్లారం, సెప్టెంబర్ 12: మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న సబ్సిడీ సమాచారాన్ని చేరవేయాలని మున్సిపల్ కమిషనర్ మంగతాయారు అన్నారు. గురువారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో రేషన్ డీలర్లు, వార్డు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంపై రూ.500 సబ్సిడీని లబ్ధిదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నిర్మలారెడ్డి, ఆర్వో నర్సింలు, వార్డు ఆఫీసర్లు సత్యనారాయణ, దుర్గాప్రసాద్, మల్లేశ్, విజయ్‌కుమార్, దినేశ్, వినోద్, పాండు, ఈశ్వరమ్మ, అనిత, ఎలీషా, అశ్విని, సునీత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

ప్రతి వార్డుకూ రూ.30 లక్షలు

అభివృద్ధి పనులకు బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

బొల్లారం, సెప్టెంబర్ 12: మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో రూ.6 కోట్ల 80 లక్షల విలువైన అభివృద్ధి పనులకు బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గురువారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించిన మేరకు ప్రతి వార్డుకూ రూ.30 లక్షలు కేటాయించారు. పలువురు సభ్యులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. మూడో వార్డ్ కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు వైకుంఠధామం ఏర్పాటుకు రూ.50 లక్షలు కేటాయిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. 15 వార్డులో పందులు, కుక్కల బెడదతో నాలుగేండ్లుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ సంతోష అన్నారు. ఒకటో వార్డుకు రూ.19 లక్షలు కేటాయించడంపై సభలో కాస్త రగడ చోటు చేసుకుంది. రెండో వార్డుకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కౌన్సిలర్ గోపాలమ్మ కోరారు. మిషన్ భగీరథ పనుల నిర్వహణపై కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కల నియంత్రణకు రూ.7.60 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు. పారిశ్రామిక వాడలో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి ప్రస్తావించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. హెచ్ఎండబ్ల్యూ, ఎస్‌బీ వారు పైప్ లైన్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్వో నర్సింహులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఏఈలు కిష్టయ్య, శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్‌నారాయణ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగదురహిత చెల్లింపులపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 12: ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సహకారంతో గురువారం తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నగదురహిత చెల్లింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సహకారంతో నగదురహిత చెల్లింపులపై ఇంటర్న్‌షిప్ కల్పించడం హర్షణీయమన్నారు. మూడు నెలల ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ వెంకట్రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జోత్స్న పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే లక్ష్య సాధన

యువత నైపుణ్యాలతోనే లక్ష్యాలను సాధించవచ్చని రిసోర్స్ పర్సన్ మహేందర్ అన్నారు. తారా కళాశాలలో ఈడీసీ, కేరీర్ గైడెన్స్ సెల్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్స్ అకాడమీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైవ్లీహుడ్ సహకారంతో ఉద్యమిత్వ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.

బ్రిడ్జిపై అదుపుతప్పిన బస్సు

కోహీర్, సెప్టెంబర్12: మండలంలోని దిగ్వాల్ గ్రామ పిరామల్ పరిశ్రమకు చెందిన బస్సు గురువారం జహీరాబాద్ పట్టణంలో అదుపుతప్పింది. కార్మికులు, స్థానికుల కథనం.. జహీరాబాద్ నుంచి దిగ్వాల్ పిరామల్ పరిశ్రమకు సెకండ్ షిఫ్ట్ కార్మికులను తీసుకువచ్చేందుకు ఒకటిన్నర సమయంలో జహీరాబాద్ శివాలయం దగ్గర నుంచి బస్సు బయలుదేరింది. ముందుగా కుమార్ హోటల్ వద్ద కార్మికులను ఎక్కించుకొని బయలుదేరాల్సి ఉంటుంది. మార్గమధ్యలో ఉన్న రైల్వే బ్రిడ్జి పైన ఓ వ్యక్తిని డ్రైవర్ రాజు తప్పించబోయే క్రమంలో బ్రిడ్జిపై బస్సు అదుపుతప్పింది. నేరుగా వెళ్లి వంతెన చివర ఉన్న గోడను ఢీకొట్టింది. బస్సు వేగం తక్కువగా ఉండడంతో వంతెన పైనుంచి కింద పడలేదు. దీంతో డ్రైవర్ రాజు సురక్షితంగా బయటకు వచ్చాడు. ప్రమాద సమయంలో బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడం, బస్సు కింద పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వంతెనపై బస్సు వేలాడుతుండడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు.

విరిగిపడిన కొండ చరియలు తొలిగింపు

బొల్లారం సెప్టెంబర్ 12: బొల్లారం మున్సిపాలిటీ ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కనే ఫుట్‌పాత్‌పై భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడిన సమస్యపై నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. గురువారం ఉదయం హుడా పెట్రోలింగ్ టీం సభ్యులు డీజీఎం రమేశ్ ఆదేశాల మేరకు ఫుట్‌పాత్‌పై పడ్డ కొండ చరియలను తొలిగించారు. దీంతో మార్నింగ్ వాకర్స్, బాటసారులు సంతోషం వ్యక్తం చేశారు.

సర్వీస్ రోడ్డు పక్కన కొండ చరియలు

నిలబడిన విద్యుత్ స్తంభం

వట్‌పల్లి, సెప్టెంబర్ 12: ఒక పక్కకు ఒరిగిన స్తంభంపై 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' పత్రికలో బుధవారం ప్రచురితమై కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మండంలోని ఉసిరికపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేపట్టారు. విరిగి, కింది భాగంలో విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలిగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

ఉసిరికపల్లిలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

త్వరలో పట్టుబడిన వాహనాలకు వేలం

సంగారెడ్డి, సెప్టెంబర్ 12: జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివరాలు, ధ్రువపత్రాలు లేని వాహనాలకు సంబంధించి యజమానుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, దీంతో వేలం వేస్తామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. పోలీసుల తనిఖీలు, ప్రమాదాలకు గురైన, దొంగిలించబడిన 289 సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి యజమానుల వివరాలు లేకపోవడంతో వేలం వేస్తామని పేర్కొన్నారు. వేలం వివరాలు జిల్లా పోలీసు అధికారిక ఫేస్‌బుక్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్ పోలీస్, ట్విట్టర్, పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే ఆరు నెలల్లో క్లైమ్ చేసుకోవచ్చారు. ఆతర్వాత నిబంధనల ప్రకారం బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. సందేహాలుంటే అదనపు ఎస్పీ సంజీవరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాలూనాయక్(87126 56726), సంబంధిత పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 12: తారా ప్రభుత్వ కళాశాలలో ఈడీసీ, ఎన్ఎస్ఎస్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. రెడ్డీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు 2023, 2024 సంవత్సరాల్లో బీఎస్సీ కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా చదివిన అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులు బీఎస్సీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలతోపాటు 3 ఫొటోలు, జిరాక్స్ కాపీ సెట్‌తో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు ట్రిప్పులు పెంచండి

జిన్నారం, సెప్టెంబర్ 12: నర్సాపూర్ నుంచి ఇమామ్‌నగర్, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, శివనగర్ మీదుగా పటాన్‌చెరు వరకు నడిచే బస్సులు పొద్దున, సాయంత్రం ఒకటే ట్రిప్పు రావడంతో విద్యార్థులు ఉద్యోగస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిన్నారం మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి నర్సాపూర్ డిపో అధికారులకు తెలిపారు. గురువారం డిపో ఇన్‌చార్జి లక్ష్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సాపూర్ బస్ డిపో నుంచి రోజుకు 17 ట్రిప్పులు బస్సులు నడపేవారని, ఇప్పుడు కూడా రోజుకూ 17 ట్రిప్పులు నడుపాలని కోరారు. ఇమామ్ నగర్ నాయకులు భిక్షపతి, నర్సింలు, కుమార్ ఉన్నారు.

క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మునిపల్లి, సెప్టెంబర్ 12: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పరిశీలించి రైతులకు రైతులకు పలు సూచనలు చేశారు. గురువారం మడల పరిధిలోని ఖమ్మంపల్లిలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని, పంటపొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి హేయం'

గుమ్మడిదల, సెప్టెంబర్ 12: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ తన అనుచరులతో కలిసి దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులపై విమర్శలు చేసినంత మాత్రాన వ్యక్తిగత దాడులు చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చిమ్ముల గోవర్దన్‌రెడ్డి, జిన్నారం మండల మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన అని పేరు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ వ్యక్తిగత దాడులు చేయడం సరికాదని హెచ్చరించారు. అధికారం ఉందని గర్వపడడం కాదు.. ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. గతంలో ఎన్నాడూ ఇలాంటి దాడులు చూడలేదన్నారు. ఇకనైనా ప్రజాపాలనను సాఫీగా కొనసాగించాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో వైద్యం వికటించి ఇద్దరు మృతి



రమేశ్(ఫైల్)



ప్రశాంత్(ఫైల్)

సంగారెడ్డి, సెప్టెంబర్ 12: ఓ ప్రైవేటు దవాఖానకు వచ్చిన యువకుడు వైద్యం వికటించి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. మూడు రోజుల క్రితం కంది మండలం ఇంద్రకరణ్‌కు చెందిన బొల్లారం రమేశ్ (33) వైద్య సేవలకు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వచ్చాడు. ఫిట్స్ వచ్చాయని చికిత్స అందిస్తుండగా ఒకేసారి గుండెపోటు రావడంతో మృతి చెందాడని వైద్యులు చెప్పారు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో దవాఖానకు చేరుకొని ఆందోళనకు దిగారు. దవాఖాన యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు భారీగా చేరుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. మృతుడికి భార్య, పాప ఉంది. పోలీసులు జోక్యం చేసుకొని దవాఖాన యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతదేహన్ని బంధువులకు అప్పగించారు.

ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే..!

హత్నూర, సెప్టెంబర్12: వైద్యం వికటించి యువకుడు మృతిచెందిన ఘటన హత్నూర మండలం వడ్డేపల్లిలో చోటుచేసుకుంది. అతడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లికి చెందిన కంచిగారి ప్రశాంత్(23) బుధవారం రాత్రి బైక్ పైనుంచి పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. గురువారం చింతల్‌చెరు గ్రామంలోని ఓప్రైవేటు దవాఖానకు వెళ్లగా అక్కడ వైద్యుడు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికి కడుపునొప్పి రావడంతో హుటాహుటిన సంగారెడ్డిలోని ఓప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహంతో చింతల్‌చెరులోని చికిత్స చేసిన దవాఖాన వద్దకు వెళ్లిన కుటుంబసభ్యులు ఇంజక్షన్ ఇవ్వడంతోనే మృతిచెందినట్లు ఆందోళన చేపట్టారు. రూ.4లక్షల నష్టపరిహారం ఇవ్వడానికి వైద్యుడితో ఒప్పందం కుదరడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై హత్నూర ఎస్ఐ సుభాష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. కొన్ని నెలలక్రితం ఈ ప్రైవేటు దవాఖానను జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు.